క్లుప్తంగా

నేటి నుంచి గురుపౌర్ణమి వేడుకలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్‌లో శ్రీ షిర్డీ సాయిబాబా సంస్థాన్‌లో 14వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. బుధవారం నుంచి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు కల్వకోలు చంద్రకళా రవీందర్ రెడ్డిలు పేర్కొన్నారు. 9న కాకడ హారతి, సాయంత్రం సుప్రభాతం తదితర పూజలు ఉంటాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఖానాపూర్‌లో...

ఇబ్రహీంపట్నం: గురు పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం నుంచి ప్రత్యేక ఉత్సవాలను ఖానాపూర్ సమీపంలోని ఏకశిలా సాయిబాబా మందిరంలో నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు చైర్మన్ మడుపు రమ్యవేణుగోపాల్‌రావు తెలిపారు. పంచామృత అభిషేకాలు, కనకాభిషేకం, అర్చనలు, హారతి, అన్న ప్రసాద వితరణ ఉంటుందని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి



మాడ్గులలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేస్తున్న అధికారులు

మాడ్గుల: రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని ఏడీఏ శోభారాణి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గ్రామాల్లో చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఇర్విన్, బ్రాహ్మణపల్లి, ఆర్కపల్లి, మాడ్గులలోని ఫర్టిలైజర్ షాపులను తనిఖీ ఆమె చేశారు. నాణ్యమైన విత్తనాలు, పురుగుల మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. నకిలీ పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీ అనే కార్యక్రమం ద్వారా పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న రైతులు నమోదు చేసుకోవాలన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిషన్

తుర్కయంజాల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించడంతో పాటు, 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని బుధవారం నిర్వహించనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.కిషన్ కార్మికులను కోరారు. మంగళవారం పురపాలక సంఘం పరిధిలోని పలు కంపెనీలలో పనిచేస్తున్న కార్మికులు, అసంఘటిత, ట్రాన్స్‌పోర్ట్, హమాలీ, మున్సిపల్ కార్మికులకు కరపత్రాలు పంచి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, ఆశీర్వాదం, శారద, భాస్కర్, శంకరయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో మహిళలు కీలకం



రీ సైకిల్‌లో భాగంగా విద్యార్థినికి స్టేషనరీ సామగ్రి అందజేస్తున్న అధికారులు

తుర్కయంజాల్: పర్యావరణ పరిరక్షణలో మహిళల పాత్ర కీలకమని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి అన్నారు. వంద రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం కమ్మగూడలోని లోటస్ ల్యాప్ స్కూల్‌లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఘన వ్యర్థాల రీ సైకిల్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మహిళలు, బాల, బాలికల్లో ఘన వ్యర్థాలపైన అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. పాత న్యూస్ పేపర్లు, నోట్ పుస్తకాలు, ప్లాస్టిక్ బాటిల్స్ వంటి వస్తువులు ఒక టన్ను సేకరించామని, దీనికి బదులుగా వారికి ఉపయోగకరమైన స్టేషనరీ వస్తువులను పంపిణీ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వినయ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల గుండెల్లో వైఎస్సార్

దివంగత ముఖ్యమంత్రి, మహానేత, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతిని ఊరూరా ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైఎస్సార్ అభిమానులు మంగళవారం ఉదయం ఆయా కూడళ్లలో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. జోహార్ వైఎస్సార్ అంటూ ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో కార్యకర్తలు నినదించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పేదల గుండెల్లో వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచారని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



ఆమనగల్లు: వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మంచాల: లింగంపల్లిలో రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు



యాచారం: వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి తదితరులు



కడ్తాల్: వైఎస్సార్ జయంతిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు



తలకొండపల్లి: మండల కేంద్రంలో వైఎస్ చిత్రపటం వద్ద..

మంద కృష్ణమాదిగ జాతి గర్వించదగ్గ నేత

యాచారం: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జాతి గర్వించదగిన నేత అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ పేర్కొన్నారు. మండల పరిధిలోని తమ్మలోనిగూడెంలో సోమవారం రాత్రి ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం, కృష్ణమాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. కృష్ణ మాదిగ కృషితోనే ఎస్సీ వర్గీకరణ కల సాకారం అయిందని నేతలు అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మహేష్‌కుమార్, బాల్‌రాజ్, యాదయ్య, మల్లేష్, కృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ రాంరెడ్డి, మాజీ సర్పంచ్ రామనుజమ్మ పాల్గొన్నారు.

బాధితులకు బాల్యమిత్రుల అండ



ఆర్థికసాయం చేస్తున్న మిత్రులు

ఇబ్రహీంపట్నం: ఆపదలో ఉన్న తమ మిత్రుల కుటుంబాలకు చర్లపటేల్‌గూడ జెడ్పీహెచ్ఎస్(2009–10 బ్యాచ్) పదో తరగతి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. గ్రామానికి చెందిన పట్నం సురేశ్ ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబానికి రూ.11 వేలను మంగళవారం అందజేశారు. అలాగే ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న తోటి స్నేహితురాలు పంది వినోదకు రూ.10 వేలు సాయం అందజేసి భరోసానిచ్చారు. భవిష్యత్తులో సైతం అండగా ఉంటామని అలనాటి మిత్రులు పేర్కొన్నారు.

వైద్య శిబిరాలకు స్పందన



మధుమేహ పరీక్ష నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీరామ క్లినిక్ ఆవరణలో మంగళవారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్, పత్యానాయక్ సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మధుమేహ వ్యాధి నిర్ధారణ శిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. శిబిరంలో ల్యాబ్ టెక్నీషియన్స్ 125 మందికి ఉచితంగా మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ పీఆర్‌ఓ పాషా, సభ్యులు పత్యానాయక్, చంద్రశేఖర్, బాలకృష్ణ, వెంకటయ్య, రాములు, రామ్మోహన్, కొండల్‌రెడ్డి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యం..

ఆమనగల్లు: ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ సహకారంతో కల్వకుర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభిస్తుంది. వారం రోజుల పాటు నిర్వహించే శిబిరంలో మంగళవారం 820 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 350 మందికి ఉచితంగా కంటి అద్దాలు అందించారు. 30 మందికి కంటి ఆపరేషన్ల నిమిత్తం ఎంపిక చేశారు. శిబిరాన్ని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సందర్శించారు. ఫౌండేషన్ సభ్యులు నరేందర్‌గౌడ్, యూసుఫ్‌బాబా, గణేశ్, యాదయ్య, రమేశ్, శేఖర్, పాల్గొన్నారు.

ఎట్టకేలకు నిరీక్షణకు తెర

- ఇబ్రహీంపట్నం మార్కెట్ మడిగెలకు ఆన్‌లైన్ వేలం
- సమకూరనున్న రూ.5.07 లక్షల ఆదాయం

ఇబ్రహీంపట్నం: ఎట్టకేలకు నిరీక్షణకు తెరపడింది. ఇబ్రహీంపట్నం వ్యవసాయం మార్కెట్ యార్డులో 17 మడిగెలను నిర్మించి సుమారు రెండేళ్లు గడుస్తున్నప్పటికీ చిన్న చిన్న మరమ్మతులతో షాపుల కేటాయింపులో జాప్యం జరుగుతూ వస్తుంది. ఈ అంశాన్ని సాక్షి దినపత్రికలో అనేకసార్లు ప్రచురించడంతో అధికార యంత్రాంగం కదిలివచ్చింది. గత నెలలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దుకాణాల సముదాయాన్ని ప్రారంభించి రిజర్వేషన్ల ప్రకారం ఆన్‌లైన్ వేలం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆన్‌లైన్ వేలం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ కరుణాకర్ పాలక సభ్యులు, అధికారులు, టెండర్‌దారుల సమక్షంలో ముందుగా రిజర్వేషన్ల ప్రక్రియను లాటరీ పద్ధతిలో తీశారు. 17 మడిగెల్లో రెండు ఎస్టీ, మూడు ఎస్సీ, ఒకటి దివ్యాంగులు, ఐదు బీసీ, ఆరు జనరల్‌కు మడిగెలను కేటాయించారు. అత్యధిక మడిగె అద్దెలు ఒకటో నంబర్ షాపు(ఓసీ) రూ.42,116, మూడో నంబర్



లాటరీ పద్ధతిలో రిజర్వేషన్లు ఎంపిక చేస్తున్న చైర్మన్ గురునాథ్‌రెడ్డి, అధికారులు

మడిగె(ఎస్సీ) రూ.41,500 పలికింది. మొత్తం 17 మడిగెలకు కలిపి ప్రతి నెల 5.07 లక్షల ఆదాయం అదనంగా రానుంది. మార్కెటింగ్ శాఖకు రూ.రెండు లక్షల డిపాజిట్ చేసి అగ్రిమెంట్ చేసుకున్న తర్వాత నెలవారి కిరాయిని ఈ వేలం దారులు చెల్లించాల్సి ఉంటుంది. 51 పాత మడిగెలకు ప్రతి నెల రూ.ఐదు లక్షలు మాత్రమే ఆదాయాన్ని సమకూర్చిపెడుతుంటే, తాజాగా 17 మడిగెలకే రూ.5లక్షల ఆదాయం రానుండటం గమనార్హం. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ ప్రాంతీయ సంచాలకులు ప్రసాద్‌రావు, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎండీ రియాజ్, స్థానిక మార్కెట్ కార్యదర్శి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాభివృద్ధికి ప్రత్యేక కృషి

కడ్తాల్: విద్యారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలను, పీహెచ్‌సీ డాక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలోని సౌకర్యాలను పరిశీలించి, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్. విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పాపయ్య, వార్డెన్ బాలరాజు, నాయకులు జవహర్‌లాల్, హీరాసింగ్, తుల్సీరాం, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



పాఠశాలలో ప్లేట్లు అందుకున్న విద్యార్థులు

మాడ్గుల: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోల్కులపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దాతలు రామ్‌మోహన్, అరుణలు కలిసి విద్యార్థులకు 120 ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఆశయంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాడ్గుల: మండల కేంద్రంలో చేపట్టిన మహిళా శక్తి ర్యాలీ

మాడ్గుల: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యత ఇస్తుందని మండల మహిళా సమాఖ్య కార్యదర్శి అరుణ అన్నారు. ఈ అవకాశాలను అతివలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. మంగళవారం మహిళా సమాఖ్య భవనంలో చేపట్టిన ఇందిరా మహిళా శక్తి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, కోటి మందిని కోటీశ్వరులుగా చేయాలన్న సంకల్పంతో స్వయం సహాయక సంఘాలను ముందుకు తీసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో కోశాధికారి చంద్రకళ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి సంబరాలు

మంచాల: రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు మంచాల మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో మంగళవారం ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. ఏపీఎం శోభ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి తహసీల్దార్ వెంకట ప్రసాద్ హాజరయ్యారు. మహిళలు పొదుపు సంఘాల ద్వారా ఆర్థిక లావాదేవీలు మాత్రమే కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లత, కోశాధికారి అనిత, కార్యదర్శి హేమ, సీసీలు సుజాత, లాల్‌సింగ్, వరలక్ష్మి, పద్మశ్రీ, అనిత, సంతోష, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల అందజేత

కడ్తాల్: సామాజిక సేవలో భాగంగా పటిష్ట నిఘా కోసం సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎస్‌ఐ వరప్రసాద్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన వడ్డెర సంఘం అధ్యక్షుడు యాదయ్య, సంఘం సభ్యులు స్థానిక ఈదమ్మ ఆలయం వద్ద రూ.10వేలు విలువ చేసే సోలార్ సీసీ కెమెరాలను ఎస్‌ఐకి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. నేర నియంత్రణకు, నిఘా వ్యవస్థ పటిష్టం చేయడం కోసం సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయని చెప్పారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు



ఎస్‌ఐకి సీసీ కెమెరాలు అందజేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

మహేశ్, శేఖర్, సంఘం నాయకులు రాజు, యాదయ్య, జంగయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిహారం తేల్చాకే భూములు తీసుకోవాలి

- సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్



రైతులతో మాట్లాడుతున్న దేవేందర్

మొయినాబాద్: గోశాల ఏర్పాటుతో భూములు కోల్పోతున్న ఎనికేపల్లి రైతులకు పరిహారం తేల్చాకే ప్రభుత్వం భూములను తీసుకోవాలని సీపీఎం పార్టీ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని ఎనికేపల్లి భూముల వద్ద రైతులతో మాట్లాడి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి నష్ట పరిహారం ఇవ్వకుండా గోశాల పనులకు భూమిపూజ చేయడం సరైన పద్ధతి కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు తెచ్చిన 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. లేదంటే రైతులు కోరిన విధంగా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల కాలంగా భూముల్లో సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేదలకు అన్యాయం చేయాలని చూస్తే చూస్తూ ఊరుకోమన్నారు. వెంటనే పరిహారం విషయాన్ని తేల్చి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అవగాహన కల్పించి.. దిగుబడి పెంచి

- రైతు నేస్తంతో సమగ్ర శాస్త్రీయ సమాచారం
- ప్రతి మంగళవారం వ్యవసాయ అధికారుల సలహాలు
- సందడిగా రైతు వేదికలు

కడ్తాల్: వ్యవసాయంలో రైతులకు మెరుగైన ప్రయోజనాలు కల్పించేందుకు సలహాలు, సూచనల కోసమని ప్రభుత్వం 'రైతు నేస్తం'కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కాలానికి అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వినూత్నంగా దీన్ని రూపకల్పన చేశారు. సాగుపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన రైతు వేదికలలో దృశ్య, శ్రవణ మాధ్యమాన్ని(ఆడియో, వీడియో) ఏర్పాటు చేశారు. కడ్తాల్ మండలంలోని 4 వ్యవసాయ క్లస్టర్లు కడ్తాల్, రావిచేడ్, ముద్విన్, మక్తమాధారం గ్రామాల్లో రైతువేదికలు నిర్మించగా అందులో మూడింటిలో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పించి కర్షకులు మెరుగైన సలహాలు ఇస్తున్నారు.

రైతులకు ఎంతో మేలు

రైతు వేదికల్లో ప్రభుత్వం రూ.మూడున్నర లక్షలు వెచ్చించి గత నెలలో ఏర్పాటు చేసిన దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా రైతుల సాగుకు సంబంధించి అనేక ప్రయోజనాలు, సలహాలు, సూచనలు అందుతున్నాయి. ఇక్కడి నుంచి శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులతో నేరుగా అనుసంధానం కావడానికి అవకాశం లభిస్తుంది. ప్రతి మంగళవారం రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

నిర్దిష్ట అంశంపై విశ్లేషణ

రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయంలో రైతులకు సమగ్ర సమచారం అందనుంది. ఉద్యాన పంటలు, పట్టు పరిశ్రమ, పాడి పరిశ్రమ, మత్స్య పరిశ్రమ, నీటి పారుదల, పంటల సాగులో సస్యరక్షణ చర్యలు, తెగుళ్ల నివారణ తదితర అనేక అంశాలకు సంబంధించి నిపుణులు సలహాలు ఇస్తారు. పత్రి మంగళవారం రైతు వేదికలలో ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించే అవకాశం కల్పించారు. దీంతో పాటు ప్రసార కార్యక్రమంలో రైతులు తమ పంటల సాగుతో పాటు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు సంబంధించిన ఇబ్బందులతో పాటు, తీసుకోవాల్సిన మెలకువలు తెలుసుకోవచ్చు. రైతు నేస్తంలో భాగంగా ప్రతివారం ఒక నిర్దిష్ట అంశంపై కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆదర్శ రైతుల అనుభవాలను తెలుసుకోవడం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో నూతన ఆవిష్కరణలు, ప్రభుత్వ సబ్సిడీ పథకాలపై అవగాహన పెంపొందించుకునేందుకు దోహదపడుతుంది. రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు, జీవన ప్రమాణాలను పెంచడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.



రైతునేస్తం కార్యక్రమం వీక్షిస్తున్న కర్షకులు

సద్వినియోగం చేసుకోవాలి



మండలంలో కడ్తాల్, ముద్విన్, రావిచేడ్ గ్రామాల్లో ప్రభుత్వం దృశ్య శ్రవణ మాధ్యమ సౌకర్యం కల్పించింది. దీంతో రైతులు నేరుగా శాస్త్రవేత్తలతో పాటు, వ్యవసాయ నిపుణులతో మాట్లాడి సాగుకు సంబంధించి సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం ఉంది. అందరూ రైతునేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – కవిత, ఏఓ, కడ్తాల్